# మండల మానినీ జనమణీ మహాసభ

**-పాలంకి సత్య**

**సా**క్షికి జంఘాలుడు నమస్కారములు

ప్రస్తుతం ఆంధ్రదేశంలో గ్రాంధిక భాషను ఎవరూ ఎక్కువగా ఉపయోగించని కారణంగా నేను నా లేఖను వ్యవహార భాషలోనే పంపుతున్నాను.

ఈ మధ్య ఆంధ్రదేశపు రాజధానీ నగరంలో అఖిల భారత స్త్రీల మహాసభ జరిగింది. సభను గురించి అన్ని పత్రికలలో ప్రకటించడం చేత నేను సభాస్థలానికి చేరుకునేసరికే సభ కిటకిటలాడుతోంది. అన్ని వయస్సుల స్త్రీలు సభకు వచ్చారు. పట్టుచీరలతో, చుడీదార్‌లతో, జీన్స్ పాంట్లతో, మినీస్కర్టులతో సభ మిలమిలలాడుతోంది.

స్త్రీల మహాసభ అయినప్పటికీ పురుషులు కూడా చాలా మంది సభకు వచ్చారు. ఉబుసుపోకకు వచ్చిన వారు కొందరు, కుతూహలంతో వచ్చిన వారు కొందరు, సభకు ఆటంకం కలిగించాలని వచ్చిన వారు కొందరు, భార్యలు సభలో పాల్గొంటూ ఉంటే పిల్లల్ని సముదాయించడానికి వచ్చిన వారు కొందరు.

సభ అయిదున్నరకు ప్రారంభం కావలసి ఉంది. సభను ప్రారంభించవలసిన ముఖ్య అతిథికి ఇంకా మూడు కార్యక్రమాలలో పాల్గొనే అవసరం ఉండడం వల్ల సభ ఆరున్నర అయినా ప్రారంభం కాలేదు. అంతవరకూ నేను సభకు వచ్చిన మహిళల సంభాషణలను వింటూ కూచున్నాను.

''ఏం వసంతా ఇంత ఆలస్యంగా వచ్చావు?'' ఒక స్త్రీ ప్రశ్న.

''నేనేమైనా నీలా హాయిగా ఇంట్లో కూచున్నానా? ఇటు ఇంట్లో చాకిరీ, అటు ఆఫీసులో పని'' రెండో ఆమె జవాబు.

''నీకేమిటమ్మా ఇంట్లో అత్తగారుండి పిల్లల్ని చూసుకుంటోంది. రోజూ నాలా క్రెష్‌లో దింపితే కష్టం తెలిసేది'' ఇంకో మహిళ విసురు.

''అత్త గారు ఇంట్లో వుండి నా ప్రాణం తీస్తోంది. పిల్లలకి డిసిప్లిన్ అన్నది లేకుండా పోయింది. నీ పిల్లలు చక్కగా పెరుగుతున్నారు'' మరో ఆమె బాధ.

మొత్తానికి ఏడు గంటలకి సభ ప్రారంభమైంది. సభా నిర్వాహకురాలు మైకు ముందు నిల్చుని ''కొన్ని వేల సంవత్సరాలుగా పురుషులు స్త్రీలని అణగతొక్కుతూ ఉన్నారు. ఈనాటికి స్త్రీలు తమ హక్కుల్ని తాము తెలుసుకుంటున్నారు. పురుషాధిక్యతని కాలరాయడం మన కర్తవ్యం. మగవారి దురహంకారం నశించాలి'' అని ఒక ధోరణిలో ప్రసంగించి ''స్త్రీలు తమ హక్కులు తాము సాధించేందుకై, ప్రపంచంలో పురుషాధిక్యత లేకుండా చెయ్యడానికై ఈ సభ ఏర్పాటు చేశాము. ఈ సభకు అధ్యక్షత వహించవలసిందిగా ప్రముఖ సంఘ సేవకురాలు శ్రీమతి ముల్లంగి భ్రమరాంబ గారిని కోరుతున్నాను'' అంది.

సభా నిర్వాహకురాలి పక్కనే ప్రార్థన పాడవలసిన ఆమె కాబోలు నిల్చుని ఉంది. ఆమె మైకు తన వైపు తిప్పుకుని ''భ్రమరాంబగారు ప్రముఖ సంఘ సేవకురాలు. ఆమె స్త్రీ జనోద్ధరణకై ఎంతో పాటు పడ్డారు. ఆమెను వేదికమీదకి ఆహ్వానించేటప్పుడు ఆమె వివాహిత అని తెలియజెయ్యవలసిన అవసరం లేదు. పేరు ముందు శ్రీమతి లేదా కుమారి అని రాసుకోవడం స్త్రీ జాతికే అవమానం'' అంది.

సభను నిర్వహిస్తున్నప్పుడు మధ్యలో అడ్డు తగలడం సభా మర్యాదకు భంగం కాదా? అని నాలో నేను అనుకున్నాను. నా మనస్సును గ్రహించినట్టుగా నా పక్కన కూచున్న ఆయన ''ఆ అమ్మాయి తండ్రి పెద్ద ఇండస్ట్రియలిస్టు. ఈ సభకయ్యే ఖర్చులో సగం భరిస్తున్నాడు. అందుకే ఆ అమ్మాయి చేత ప్రార్థనా గీతం పాడిస్తున్నారు'' అన్నాడు.

సభ నిర్వహించే ఆవిడ మైకు తన వైపు తిప్పుకుని ''సభలో ముఖ్య వక్తగా ప్రముఖ న్యాయవాది ఆమని గారిని ఆహ్వానిస్తున్నాను. ఆమని గారు స్త్రీలకి చేసిన సేవ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు. దుర్మార్గులైన భర్తల నుంచి విడాకులిప్పించి ఆవిడ ఎందరో మహిళలని కాపాడారు. మహిళా కార్మికుల తరపున ఎన్నో కేసులు వాదించారు'' అని చెప్పింది.

భ్రమరాంబగారు ముందుగా, ఆమని గారు వెనుకగా వేదికని అలంకరించారు. ఇద్దరూ పట్టుచీరలతో మెరిసిపోతున్నారు. అయితే భ్రమరాంబ గారి ముఖాన రూపాయ కాసంత కుంకుమ బొట్టు, జడలో మల్లెపూదండ, చెవులకి రవ్వల దుద్దులు, ముక్కుకు ముత్యాల ముక్కు పుడక ఉన్నాయి. ఆమని గారు స్లీవ్‌లెస్ బ్లౌజుతో, బాబ్డ్ హెయిర్‌తో, లిప్‌స్టిక్‌తో ఉన్నారు.

సభా నిర్వాహకురాలు ''ప్రఖ్యాత కవయిత్రి కాంతిమతి గారిని వేదిక మీదకి ఆహ్వానిస్తున్నాను. కాంతిమతిగారు దేశ దేశాలలో పర్యటించి భారతీయ స్త్రీలకి జరుగుతున్న అన్యాయాలని కవితా రూపంలో ప్రపంచానికి చాటి చెప్పారు'' అంది. జీన్స్‌పాంట్‌తో ''అయ్ హావ్ బీన్ టు అమెరికా'' అని రాసి ఉన్న బనియన్‌తో ఒక అమ్మాయి వేదిక మీదకి వెళ్ళింది.

''ప్రముఖ రచయిత్రి స్టెల్లా గారిని వేదిక మీదకి ఆహ్వానిస్తున్నాను. స్టెల్లా గారు స్త్రీల కోసం ఎన్నో రచనలు చేశారు. అందాల పోటీలు నిర్వహించకుండా ఉద్యమాలు చేపట్టారు. స్త్రీలో కేవలం బాహ్య సౌందర్యాన్ని మాత్రమే చూసే మగజాతిని దుయ్యబడుతూ వ్యాసాలు రాశారు. సమాజంలో పురుషాధిక్యత తగ్గడానికి స్టెల్లా గారి రచనలు ఎంతో దోహదం చేశాయి'' అన్న పరిచయ వాక్యాల మధ్య ఒక మధ్య వయస్కురాలు వేదికని అలంకరించింది. నల్లటి నూలు చీర, ఎర్రని సిల్కు జాకెట్టు వేసుకుంది. అందంగా కనిపించాలనుకోవడమే మహాపాపం అన్నట్టుగా ఉందామె అలంకరణ.


సభకి అధ్యక్షత వహించిన భ్రమరాంబ గారు ఉపన్యాసం ప్రారంభించారు. ''అనాదిగా ఆడదానికి అన్యాయం జరుగుతోంది. మగవాడు ఆడదాన్ని అణగదొక్కుతూనే ఉన్నాడు. ఉద్యోగం పురుష లక్షణం అన్నారు. నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి అన్నారు. ఇదెక్కడి న్యాయం? ఆడది ఉద్యోగం చెయ్యకూడదా? స్వతంత్రంగా జీవించకూడదా? ఈ ప్రశ్నలు ఆధునిక మహిళ మనస్సులో ఉద్భవిం




చాయి. అంతే. ఆమె తిరగబడింది. చదువుకుంది. ఉద్యోగంలో ప్రవేశించింది. దాంతో మగవారిలో అసూయ మొదలైంది. ఆడవాళ్ళు సరిగ్గా పని చెయ్యరన్నారు. ఆఫీసులో ఉన్నా ఆడదాని మనస్సు ఇంటి మీదే ఉంటుందని అన్నారు. అసలు సీటుకి అతుక్కుపోయేలా కూచుని పని చేసేది ఆడవాళ్ళే''

భ్రమరాంబ గారి మాటలకి చాలా మంది మగవాళ్ళు కూడా సిగ్గుపడ్డారు. రౌడీ మనస్తత్వమున్న కొందరు పురుషులు ఈలలు వేశారు. ఈల విన్పు ళ్ళకి ఆవిడలో ఆవేశం పెల్లుబికింది.

''అదిగో చూశారా మగవాళ్ళకి వచ్చిందంతే. ఈలలు వేస్తూ, దుమ్ము కొడుతూ కాలక్షేపం చేస్తారు. అందుకే ప్రభుత్వం మూడో వంతు ఉద్యోగాలు స్త్రీలకి కేటాయించింది. జనాభాలో సగమున్న స్త్రీలకి మూడోవంతు కేటాయిస్తే చాలదు. తరతరాలుగా స్త్రీ అణగదొక్కబడింది. అందుకే కొన్ని తరాలు గడిచేదాకా స్త్రీలే ఉద్యోగాలు చెయ్యాలి. పురుషులు ఇంటి పనికి అంకితమవాలి. అప్పుడే స్త్రీకి సమానత్వం ...'' భ్రమరాంబ గారి




ఉపన్యాసం సాగిపోయింది.

ఆ తరువాత ఆమని గారు మైకు అందు కున్నారు. ''ప్రభుత్వం స్త్రీలకి ఉద్యోగాలలో రిజ ర్వేషను కల్పించింది. అంతటితో సరిపోయిందా? ఉద్యోగమిచ్చినంతలో అయిపోయిందా? పనిలో సమాన బాధ్యతలు ఇవ్వఖ్కర్లేదా? ఆడ వాళ్ళను ఔట్ స్టేషన్ డ్యూటీలకు ఎందుకు పంపరు? మహిళా కార్మికులని నైట్ డ్యూటీలు ఎందుకు చెయ్యనివ్వరు? అందుకే నేను స్త్రీలు కూడా నైట్ డ్యూటీ చేసే అవకాశం కల్పించాలని కోర్టులలో రిట్ వేశాను. స్త్రీ సమానత్వాన్ని సాధించడం నా గురుతర బాధ్యత. ఆడవాళ్ళు నైట్ డ్యూటీలు చెయ్యలేరని చెప్పి వారికి ప్రైవేటు సంస్థలు ఉద్యోగాలు ఇవ్వడం లేదు. స్త్రీలలో డాక్టర్లు, నర్సులు, టెలిఫోన్ ఆప రేటర్లు నైట్ డ్యూటీలు చెయ్యడం లేదా? కార్మి కులు ఎందుకు చెయ్యలేరు ...'' అరగంట దాకా ఆమని గారి వాక్ప్రవాహం ఆగలేదు.

కాంతిమతి గారు కవితాగానం చేస్తారని ప్రక టించారు. కాంతిమతి గారు మైకు ముందు నిల్చుని ముఖంమీద పడుతున్న జుట్టును వెనక్కి తోసుకు న్నారు. సింహం జూలు విదిల్చినట్టనిపించింది.

''నేను మాటల మనిషిని కాదు. కొన్ని చిన్న వాక్యాలతోనే పెద్ద విషయాన్ని చెప్పడం నా అల వాటు. చైనాలో అంతర్జాతీయ మహిళా సదస్సులో నేను కవితా గానం చేసినప్పుడు అందరూ ఎంతగానో శ్లాఘించారు ...'' అయిదు నిమిషాల ఆత్మస్తుతి అనంతరం కవితాగానం ప్రారంభమైంది.

సాక్షీ, కాంతిమతి గారి కవితను మన సంఘా నికి పంపడానికి నేను సంకోచిస్తున్నాను. ''చెట్టునైతే ఎంతో బాగుండేది ఏడాదికి ఒకసారే ఎర్రగా చిగిర్చేదాన్ని నెలనెలా నాకెందుకో రొష్టు తెల్లని చీర మీద ఎర్రగా రక్తం మరకలు పడతాయన్న భయం హాయిగా తిరిగే మగవాడే ఏమదృష్టంరా నీది...'' నెల నెలా స్త్రీకి వచ్చే రుతుక్రమం వర్ణించిన తరువాత ఆమె కవితాగానాన్ని ఇంకా సాగిస్తూ ''కోడి పెట్ట ఎంత హాయిగా గుడ్డు పెట్టేస్తుంది కోమలులకి అలా కాదే ...'' అంటూ ప్రసవాన్ని వర్ణించి స్త్రీకి సృష్టి లోనే అన్యాయం జరుగుతోందని తీర్మానించింది.

ఆమె కవితా గానానికి పురుషులే సిగ్గుపడి పోయారు. ''అమ్మా ప్రకృతి ధర్మాలని పురుషాధి

**''నేను మాటల మనిషిని కాదు. కొన్ని చిన్న వాక్యాలతోనే పెద్ద విషయాన్ని చెప్పడం నా అల వాటు. చైనాలో అంతర్జాతీయ మహిళా సదస్సులో నేను కవితాగానం చేసినపుడు అందరూ ఎంతగానో శ్లాఘించారు ...''**

కృతగా తీర్మానిస్తూ ఎలా తల్లీ'' అని అడగాలని పించింది. ఈలోగా స్టెల్లా గారు మైకు ముందుకు వచ్చారు.

''నేను ఈ సభలో ప్రత్యేకంగా మాట్లాడవ లసిందేమీ లేదు. నేను చెప్పదల్చుకున్నదంతా నా కథల్లో చెప్తూనే ఉన్నాను. నా కథలు చదవని వారు ఈ సభలో లేరని నేను ఘంటాపథంగా చెప్పగలను. స్టెల్లా కథలు ఊకదంపుడు ఉపన్యాసాలు అనే వారు కోకొల్లలు. అలాంటి వారిని నేను పట్టించుకోను. నేను స్త్రీల కోసమే రాస్తున్నాను. స్త్రీ జనోద్ధరణే నా జీవిత లక్ష్యం. ఈ మధ్యనే వచ్చిన నా కథ ఒకటి మీరందరూ చదివే ఉంటారు. ఒక వివాహితుడు ఆఫీసులో అమ్మాయితో సంబంధం పెట్టుకుం టాడు. తనకు వివాహమైందని ఆమెకు తెలియ నివ్వడు. కొలీగ్‌తో సంబంధం ఉందని భార్యకు తెలి యనివ్వడు. కానీ ఆ ఇద్దరూ నిజం తెలుసు కుంటారు. పూర్వకాలం రచయిత్రులైతే ''నాతో ఉండు'' అంటే ''నాతో ఉండు'' అని ఆ మగవాణ్ణి ప్రాధేయపడే వారు. లేదా రెండో ఆమెనే సుఖపెట్ట మని ఒకామె చచ్చిపోయినట్టు చిత్రీకరించే వారు. కానీ నేను అలా చెయ్యలేదు. ఆ ఇద్దరూ కలిసి అతన్ని వదిలేసి విడిగా కాపురం పెట్టుకున్నట్టుగా కథ ముగించాను. స్త్రీ సమానత్వానికి పరాకాష్ఠ అదే. మనం మగ వారితో సమంగా చదువుకుంటున్నాం, మగ వారితో సమంగా ఉద్యోగాలు చేస్తున్నాం. మన తిండికీ, బట్టకీ వాళ్ళమీద ఆధారపడడం దేనికి? నన్నడిగితే స్త్రీకి సంపూర్ణ స్వాతంత్ర్యం లభించ డానికి లెస్బియనిజం ఒక్కటే మార్గమంటాను. ఆడపిల్లని ఆడదే కంటోంది. ఆడపిల్లని ఆడదే పెంచుతోంది. ఆడదానికి సుఖం ఆడదివ్వలేదా?''

ఆవేశంగా అన్న స్టెల్లా మాటలకి వెనక వరసలో కూర్చున్న ఒకరు ''సంతానం ఎలా'' అని అరిచారు.

''పీడా విరగడాయె. పిల్లల్ని కనిపెంచడం వల్లనే స్త్రీకి జీవితంలో ఏదీ సాధించే అవకాశం ఉండడం లేదు.''

సభలో గందరగోళం మొదలైంది. ఆడవాళ్ళు రెండు జట్లుగా విడిపోయి అరుచుకోవడం మొద లెట్టారు.

''దేనికైనా హద్దూ పద్దూ ఉండాలి. అసలు మగవాడి అవసరమే లేదా?''

''మన అవసరం వాడికి కానీ వాడి అవసరం మనకేమిటి?''

''మరి పిల్లలే లేకపోతే జాతి అంతరించి పోదా?''

''క్లోనింగ్ ఉందిగా.''

సభ ట్రాఫిక్‌జామ్ అయిన రోడ్డులా, చేపల మార్కెట్టులా తయారయింది. ఎవరి మాటలు ఎవరికీ వినిపించడం లేదు. అరుపులకి భయపడ్డ పిల్లలు కొందరు ఏడవడం ప్రారంభించారు. పిల్లలని భర్తల చేతికిచ్చి పడతులు రణరంగంలోకి దూకారు. అరుపులూ, కేకలూ దాటి సిగపట్ల దాకా వచ్చింది సభ.

సాక్షీ, ఆ సమయంలో నేను వేదిక మీదికి వేగం గా వెళ్ళి మైకు అందుకున్నాను. కంచుగంట లాంటి కంఠాన్నిచ్చిన భగవంతుడికి కృతజ్ఞతలు చెప్పుకు న్నాను.

''అమ్మలారా, అక్కలారా, అమ్మాయి లారా'' నా కంఠ ధ్వనికి సభ ఒక్కసారిగా నిశ్శబ్ద మైంది. నేను ఈ విధంగా ఉపన్యసించాను.


''స్త్రీలు పురుషులతో సమంగా [illegible] ఉద్యోగాలు చేసి సమాజాభివృద్ధికి తోడ్పడుతున్నందుకు సంతోషించే వారిలో మొదటి వ్యక్తిని నేను. కొన్ని శతాబ్దాల పాటు స్త్రీ జాతి అణగదొక్కబడింది మాట వాస్తవమే. భర్త మరణించిన తరువాత స్త్రీకి జీవించడానికి కూడా అర్హత లేదని శాసించారు. బతికినా కూడా జీవచ్ఛవంలా పడి ఉండమని నిర్దేశించారు. అతి చిన్న వయస్సులోనే అమ్మాయికి వివాహం జరిపి పిల్లలని కనే యంత్రంలా మార్చారు. ఈ అన్యాయాలన్నిటికీ మూలమైన రాజకీయ, సామాజిక, మతపరమైన కారణాలను మనం విశ్లేషించలేం. కానీ ఈ అన్యాయాలను ముందుగా ప్రతిఘటించింది మాత్రం మగవారేనని చెప్పగలను. వారి కృషి ఫలితంగానే సతీసహగమనం చట్ట విరుద్ధమైంది. బాల్య వివాహాలు లేకుండా పోయాయి. వితంతువులు తల ఎత్తుకుని తక్కిన స్త్రీలతో సమంగా తిరగగల్గుతున్నారు. స్త్రీలు విద్యావంతులై ఉద్యోగాలు చేస్తున్నారు.

కానీ అమ్మలారా, ఏ మహత్తరమైన ఆదర్శాలతో ఉద్యమాలు జరిగాయో ఆ ఆదర్శాలను మీరు మరిచినట్టుగా ఉంది. సభలో ప్రసంగించిన మహిళలకు స్త్రీలంటే చదువుకుని ఉద్యోగాలు చేసే అవకాశమున్న స్త్రీలే అని మనస్సులో ఉన్నట్టుంది. అమ్మా, భ్రమరాంబా, మీరు ప్రభుత్వోద్యోగాలు నూరు శాతం స్త్రీలకే కేటాయించాలన్నారే. దేశంలో ఉన్న ఉద్యోగాలలో ప్రభుత్వోద్యోగాలు రెండు శాతం కూడా లేవే. మరి మిగతా స్త్రీలందరూ ఏం కావాలి తల్లీ. మీరు పోరాడవలసింది దేనికి? దేశంలో పరిశ్రమలు ఎక్కువై, ప్రజాసేవా కార్యాలయాలు విస్తరించి ఉద్యోగాల సంఖ్య ఎక్కువ కావడం ముఖ్యమా లేక ఉన్న అతి కొద్ది ఉద్యోగాలు చదువుకునే అవకాశమున్న ధనిక స్త్రీలకి లభ్యమవడం జరిగితే చాలునా? అమ్మా, ఆమనీ, కోర్టులో రిట్ వేసే ముందు ఎందరు మహిళా కార్మికులు నైట్ డ్యూటీ చెయ్యడానికి సిద్ధంగా వున్నారో తెలుసుకున్నావా తల్లీ.

తల్లీ, కాంతిమతీ, ప్రకృతి ధర్మమే నీకు పురుషాధిక్యతగా కన్పించిందా?

పురుషాధిక్యత నశించాలంటే లెస్బియనిజమే మార్గమా? స్టెల్లా, నువ్వు సైకాలజీ చదువుకోవా లమ్మా. ఎవరూ కావాలని లెస్బియన్లుగా మార లేరమ్మా.

అమ్మలారా, స్త్రీలు ముందంజ వెయ్యడానికి మార్గం పురుషులని వెనక్కి తొయ్యడం కాదమ్మా. మీలో కొందరికి చదువుకుందుకు ఆర్థికంగా,




సమాజపరంగా సాధ్యమైంది. కానీ పల్లెసీమల్లో, గిరిజన ప్రాంతాలలో ఆడవారికి అవకాశాలే లేవు. అటువంటి స్త్రీల అభ్యుదయం గురించి ఆలోచించారా? పరకట్నం పోవాలంటే స్త్రీలంతా చదువుకుని ఉద్యోగాలు చెయ్యాలి అని ఒక్కముక్కలో చెప్పేస్తున్నారే? కానీ పుస్తకాలు కొనుక్కోలేని, పరీక్షలకి ఫీజులు కట్టలేని నిరుపేద అమ్మాయిలేం చెయ్యాలమ్మా. దేశంలో నిరుద్యోగ సమస్య ఎంత ఎక్కు-

**పురుషాధిక్యత నశించాలంటే లెస్బియనిజమే మార్గమా? స్టెల్లా, నువ్వు సైకాలజీ చదువుకోవా లమ్మా. ఎవరూ కావాలని లెస్బియన్లుగా మార లేరమ్మా.**

వగా ఉందో మీకు తెలియదా, అప్పుచేసో, అడుక్కునో అమ్మాయిలు చదువుకుంటారే అనుకుందాం. వాళ్ళకి ఉద్యోగం వస్తుందని మీరు గ్యారంటీ ఇవ్వగలరా?

ప్రపంచంలోని పురుషులందరూ దుర్మార్గులనీ, స్త్రీల మీద ఆధిపత్యం చెలాయిస్తారనీ, పురుషాధిక్యత పోయి స్త్రీ పురుషులు సమానమవాలంటే స్త్రీలు ఆర్థికంగా స్వాతంత్ర్యం సంపాదించాలన్న వాదం తీవ్రంగా ఉన్నట్టు అనిపిస్తోంది. ఆ వాదాన్ని నిజమనే ఒప్పుకుందాం. అప్పుడు మహిళాభ్యుదయానికి మీరు చెయ్యవలసినదేమిటి? మీటింగులు పెట్టి మగవారిపై విరుచుకుపడడమా? మీలో ఒక్కొక్క ఉద్యోగినీ ఒక్కొక్క నిరుపేద అమ్మాయికి చదువు చెప్పించవచ్చునే. ఏడాదిలో కొనుక్కునే చీరలలో ఒక్క చీర కొనడం తగ్గిస్తే ఒక ఆడపిల్లకు చదువు చెప్పించవచ్చును. ధనవంతులైన స్త్రీలు ఘనంగా విందులూ, వినోదాలూ మానేసి ఆ డబ్బుతో వెనకబడిన ప్రాంతంలో ప్రభుత్వ సహాయం తీసుకుని చిన్న పరిశ్రమ స్థాపించి పది మంది బీద స్త్రీలకు జీవనాధారం కల్పించవచ్చును. మీ ఇంట్లో పని మనిషికి అధిక సంతానం వల్ల కలిగే నష్టాలను వివరించి ఆమె కుటుంబ నియంత్రణ పాటించేలా చెయ్యవచ్చును. ఇళ్ళల్లో పనిచేసే స్త్రీలు ఆపరేషన్ అంటే భయపడతారు. పురుడయిన నెలకే పనిలోకి రాకపోతే వారికి ఇల్లు గడవదు. ఆపరేషన్ చేయించుకుంటే నీకు జీతంతో మెటర్నిటీ లీవు ఇస్తానని మీలో ఒక్కరైనా అనగలరా? మీ మెటర్నిటీ బెనిఫిట్స్ కోసం సమ్మెలు కూడా చేస్తున్నారే. మీ ఇంట్లో పని చేసేది ఆడది కాదా. ఆమెకు ఏ సదుపాయాలూ అవసరం లేవా?

సోదరీ మణులారా, మీరు నిజంగా మహిళాభ్యుదయాన్నే కోరుకుంటే స్త్రీలందరికీ విద్యా, ఉద్యోగ అవకాశాలు ఎక్కువయ్యేలా ప్రయత్నించండి. అభాగ్యులైన ఆడవారిని ఆదుకోండి. ఎక్కడైనా, ఎప్పుడైనా స్త్రీకి అన్యాయం జరిగితే ఆమెకు న్యాయం జరిగేలా చూడండి. విద్యా, ఉద్యోగ రంగాలు మెరుగుపరచడం మగవారి బాధ్యత, పురుషులపై విరుచుకు పడడమే మా పని, మేము మీటింగ్లూ, ఊరేగింపులూ, ధర్నాల గురించి తప్ప ఇవేమీ ఆలోచించం అంటారా నేను చెప్పగలిగిందేమీ లేదు. ఓం శాంతి శ్శాంతి శ్శాంతి.

**(పానుగంటి వారికి కృతజ్ఞతలతో, క్షమాపణలతో)**